

RNI: APTEL/2010/36742

# న్యూస్ వార్

వార్తా పత్రిక

TELANGANA RISING GLOBAL SUMMIT

నల్లగొండ | epaper.news war.com | బుధవారం 25, మార్చి 2026 | సంపుటి :16 సంచిక :7 | ఎడిటర్: నటవా కృష్ణారావు | పేజీలు : 4 , వెల.2.00




2

## బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డికి సీతక్క కౌంటర్

గత పదేళ్లుగా వికలాంగులు, వితంతువుల పెన్షన్లు పెంచలేదు కానీ.. పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారంటూ బీజేపీ నేతలపై తెలంగాణ పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మండిపడ్డారు. మంగళవారం తెలం గాణ అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ శాసన సభా పక్ష నేత మహేశ్వర్ రెడ్డి విమర్శలు గుప్పించారు.



2

## డ్రగ్స్ కేసు: సిట్ విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి..

బీఆర్ఎస్ తాండూరు మాజీ ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డికి చెందిన మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో వెలుగుచూసిన డ్రగ్స్ పార్టీ వ్యవహారంపై శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ కేంద్రంగా సిట్ విచారణ ముమ్మరంగా సాగుతోంది. నిందితుల వాంగ్మూలాలు ఈ కేసును మరో మలుపు తిప్పాయి.

# ఈవీ వాహనాలపై 20 శాతం డిస్కౌంట్

- ఈవీ ఆటోలతోపాటు బస్సులు
- నగరాన్ని క్యూర్ చేయాలని ఈ కార్యక్రమం
- తెలంగాణలో ఈవీ వాహనాలకు సబ్సిడీ
- వాహన కాలుష్యాన్ని అరికట్టేందుకు ఈ నిర్ణయం
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్ నగరంలో వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందుకోసం ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ) తీసుకువస్తున్నట్లు తెలిపారు. రూ.1000 కోట్ల ఆదాయం నష్టమైనా ఈవీ వాహనాలు తీసుకొస్తున్నామని వివరించారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడుతూ.. కాలుష్యాన్ని నివారించాలనే ఉద్దేశ్యంతోనే ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చామన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో పని చేస్తున్న ఉద్యోగులకు ఈవీ వాహనాలపై 20 శాతం డిస్కౌంట్ ఇస్తున్నామని ప్రకటించారు.

వివరాలు 2లో..



## ఇరాన్ యుద్ధం.. రంగంలోకి సౌదీ అరేబియా, యూఏఈ..

ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడులను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాయిదా వేయడంతో ప్రపంచ దేశాలకు కాస్త ఉపశమనం లభించింది. ఇలాంటి తరుణంలో ప్రముఖ 'వాల్‌స్ట్రీట్' జర్నల్ ప్రచురించిన ఓ కథనం సంచలనంగా మారింది. ఇరాన్‌తో అమెరికా సాగిస్తున్న యుద్ధంలో సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పాల్గొనేందుకు సిద్ధమవుతున్నట్టు 'వాల్‌స్ట్రీట్' జర్నల్ పేర్కొంది. తమ వైమానిక స్థావరాల నుంచి ఇరాన్‌పై దాడులు చేయడానికి ఇప్పటివరకు అమెరికాకు అనుమతి ఇవ్వని సౌదీ అరేబియా.. తాజాగా మనసు మార్చుకున్నట్టు ఆ కథనం పేర్కొంది.

వార్త 2లో



## ఒకవైపు శాంతి చర్చలు.. మరోవైపు దాడులు.. ఇరాన్ నగరాలపై బాంబుల వర్షం..

ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడులను ఐదు రోజులు వాయిదా వేస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించగానే అంతర్జాతీయంగా కాస్త ఉపశమనం నెలకొంది. పలు దేశాల స్టాక్ మార్కెట్లు లాభాలు ఆర్జించాయి. చమురు ధరలు తగ్గాయి. యుద్ధం విషయంలో ట్రంప్ కాస్త వెనక్కి తగ్గినా ఇరాన్‌పై దాడులు మాత్రం ఆగడం లేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన తర్వాత కూడా ఇరాన్ నగరాలపై దాడులు జరుగుతూనే ఉన్నాయి.

వార్త 2లో

## వెళ్తున్నానని తెలిసి.. అలా వచ్చి వెళ్లారు: జీవన్ రెడ్డి

తన పదేళ్ల ఒంటరి పోరును పార్టీ అధిష్ఠానం చిన్నచూపు చూసిందని మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తనకు పీసీసీ చీఫ్ పదవి రాకున్నా.. పార్టీ అధికారంలోకి వచ్చినందుకు సంతోషపడ్డానన్నారు. మంగళవారం జగిత్యాలలోని తన నివాసానికి పార్టీ అధిష్ఠానం పంపిన దూతలతో సమావేశమయ్యారు. ఈ సమావేశం అనంతరం టి. జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. రాజకీయాల్లో తనది పూలబాట కాదని.. ముళ్ల బాట అని స్పష్టం చేశారు.



వార్త 2లో

## క్రైస్తవ మతంలోకి మారితే ఎస్సీ హోదా రద్దు: సుప్రీంకోర్టు సంచలన తీర్పు

మతం మారిన వారి ఎస్సీ హోదాకు సంబంధించి సుప్రీం కోర్టు తాజాగా కీలక తీర్పు వెలువరించింది. క్రిస్టియన్ మతంలోకి మారాక ఎస్సీ హోదా ఉండదని పేర్కొంది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలు కాకుండా ఇతర మతాల్లోకి మారితే ఎస్సీ (రాజ) హోదా వర్తించదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్వీ అంజారియాలతో కూడిన ధర్మసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది.



వార్త 2లో

## బిఆర్ఎస్ హయాంలో దివ్యాంగుల సంక్షేమానికి ఎంతో కృషి చేశాం: కెటిఆర్

హైదరాబాద్:

కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇక్కట్లు పడుతున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. దివ్యాంగులకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు. అసెంబ్లీ ముందు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ను దివ్యాంగులు కలిశారు. రేపు చేపట్టనున్న వికలాంగుల దీక్షకు రావాలని కెటిఆర్ ను కోరారు. ఈ సందర్భంగా కెటిఆర్ మీడియాతో మాట్లాడుతూ.. దివ్యాంగుల సైతం



రోడ్లపైకి వచ్చి నిరసన తెలుపుతున్న పరిస్థితి వచ్చిందని, దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్ ఇస్తామని సిఎం రేవంత్ సర్కార్ మాట తప్పిందని కెటిఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక దివ్యాంగుల సంక్షేమం గంగలో కలిసిపోయిందని, నెల నెలా వచ్చే పెన్షన్ కూడా దివ్యాంగులకు సమయానికి అందడంలేదని మండిపడ్డారు. దివ్యాంగుల సంక్షేమానికి బిఆర్ఎస్ హయాంలో ఎంతో కృషి చేశామని తెలియజేశారు. శాసనసభలో దివ్యాంగుల సమస్యలపై ప్రస్తావిస్తామని, దివ్యాంగుల పక్షాన బిఆర్ఎస్ పోరాడుతుందని, ఈ అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామిలను నెరవేర్చే వరకు పోరాడుతామని అన్నారు.

## హైదరాబాద్‌లో పలు పెట్రోల్ బంక్‌లలో నో స్టాక్ బోర్డులు

హైదరాబాద్:

తెలంగాణ వ్యాప్తంగా పెట్రోల్ బంక్‌ల ముందు ఆటోలు క్యూ కట్టాయి. పెట్రోల్, డీజిల్ కొరత దృష్ట్యా పెట్రోల్ బంక్‌లకు వాహనదారులు పోటెత్తారు. అత్తాపూర్, మల్లాపూర్, అంబర్ పేట్, నాగోల్, ఉప్పల్, బోడుప్పల్, ఘట్ కేసర్, జిహెచ్ఎంసి పరిధిలో చాలా ప్రాంతాల్లో పెట్రోల్ బంక్‌ల దగ్గర ఆటోలు భారీగా క్యూ కట్టాయి. పలు పెట్రోల్ బంక్‌లలో నో స్టాక్ బోర్డులు దర్శనమివ్వడంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు.



# బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డికి సీతక్క కౌంటర్

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

గత పదేళ్లుగా వికలాంగులు, వితంతువుల పెన్షన్లు పెంచలేదు కానీ.. పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారంటూ బీజేపీ నేతలపై తెలంగాణ పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మండిపడ్డారు. మంగళవారం తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ శాసన సభా పక్ష నేత మహేశ్వర్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలో మహేశ్వర్ రెడ్డికి సీతక్క కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. కేంద్రం ఏ రకంగా మద్దతు ఇవ్వకున్నా ప్రజాసంక్షేమం కోసం తమ ప్రభుత్వం అధికంగా నిధులు వెచ్చిస్తుందన్నారు. రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా.. కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు తెచ్చే బాధ్యత మీకు లేదా? అంటూ వారిని సూటిగా ప్రశ్నించారు.వ్యవసాయంపై కేంద్రం నల్ల చట్టాలు తీసుకు వస్తే.. దీనిపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పోరాటం చేశారన్నారు. దాంతో కేంద్రం వెనక్కి తగ్గిందని సీతక్క గుర్తు చేశారు. దేశంలో బడా పారిశ్రామికవేత్తలకు చెందిన రూ.16 లక్షల కోట్లను రుణమాఫీ చేశారు కానీ రైతు రుణమాఫీ మాత్రం చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త రేషన్ కార్డు ఒక్కటి కూడా ఇవ్వలేదన్నారు. వడ్డీ లేని రుణాల మీద తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ బీజేపీ నేతల వైఖరిని ఈ సందర్భంగా ఎండగట్టారు.బ్యాంకింగ్ రుణాల కింద రూ.58 వేల కోట్ల మంజూరు చేశామని సీతక్క గుర్తు చేశారు. అలాగే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామన్నారు. ఉచిత విద్యుత్, సన్న వడ్లతోపాటు రూ. నాలుగున్నర లక్షల కోట్లతో ఇందిరమ్మ ఇండ్లు కడుతున్నామని తెలిపారు. మీ ఊకదంపుడు ఉపన్యాసాలతో ప్రజలకు పని లేదన్నారు. రైతులకు ప్రతి నెల పెన్షన్స్ ఇస్తామని బీజేపీ హామీ ఇచ్చిందన్నారు. అదే విధంగా విదేశాల్లోని నల్లధనాన్ని తెచ్చి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ. 15 లక్షలు వేస్తామని ప్రకటించారని చెప్పారు.రూ. 50కే లీటర్ పెట్రోల్ ఇస్తామన్నారని సీతక్క గుర్తు చేశారు. కానీ పెట్రోల్ ధరలు ఇష్టారాజ్యంగా పెంచారంటూ కేంద్రంపై నిప్పులు చెరిగారు. విభజన హామీలు నెరవేర్చకుండా వట్టిగా ప్రసంగిస్తే ఏం ఉపయోగం అంటూ బీజేపీ నేతలకు ఈ సందర్భంగా సీతక్క చురకలంటించారు. తెలంగాణ ప్రజలు చెల్లించే పన్నులు కావాలి కానీ.. ఆ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు మాత్రం పట్టవా అంటూ బీజేపీ నేతలను ఈ సందర్భంగా నిలదీశారు.గత ప్రభుత్వ తీరు వల్ల ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ఇచ్చిన హామీలను తమ ప్రభుత్వం అమలు చేస్తుందని సీతక్క స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆర్థిక చేయూతతో నాలుగు లక్షల 70 వేల మంది మహిళలు వ్యాపారాలు చేసుకుంటున్నారని వివరించారు. కోటి మంది మహిళలు కోటీశ్వరులను చేస్తామని సంకల్పంతో తాము పని చేస్తున్నామన్నారు. ఈ ప్రభుత్వాన్ని ఎగతాళి చేయడం మీకే చెల్లిందంటూ బీజేపీ శాసన సభ పక్ష నేత మహేశ్వరరెడ్డి తీరును ఈ సందర్భంగా మంత్రి సీతక్క ఎండగట్టారు.

# ఈవీ వాహనాలపై 20 శాతం డిస్కౌంట్

### ఈవీ ఆటోలతోపాటు బస్సులు
### నగరాన్ని క్యూర్ చేయాలని
### ఈ కార్యక్రమం
### తెలంగాణలో ఈవీ
### వాహనాలకు సబ్సిడీ
### వాహన కాలుష్యాన్ని
### అరికట్టేందుకు ఈ నిర్ణయం
### రవాణా శాఖ మంత్రి
### పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి



హైదరాబాద్ నగరంలో వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందుకోసం ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ) తీసుకువస్తున్నట్లు తెలిపారు. రూ.1000 కోట్ల ఆదాయం నష్టమైనా ఈవీ వాహనాలు తీసుకొస్తున్నామని వివరించారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడుతూ.. కాలుష్యాన్ని నివారించాలనే ఉద్దేశ్యంతోనే ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చామన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో పని చేస్తున్న ఉద్యోగులకు ఈవీ వాహనాలపై 20 శాతం డిస్కౌంట్ ఇస్తున్నామని ప్రకటించారు. తెలంగాణ కాలుష్య రహిత రాష్ట్రంగా ఉండాలని ప్రయత్నిస్తున్నామని.. అందుకోసం ఈ ప్రయత్నం తీసుకువచ్చామని మంత్రి పొన్నం తెలిపారు. ఈవీ ఆటోలతోపాటు బస్సులను సైతం తీసుకుని వస్తున్నామన్నారు. నగరాన్ని క్యూర్ చేయాలని ఈ కార్యక్రమం చేపట్టామని వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో ఈవీ వాహనాలకు సబ్సిడీ ఇస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. దేశంలోని వివిధ ప్రధాన నగరాలు.. తీవ్ర కాలుష్యంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. వాహనాల నుంచి వెలువడే కాలుష్యం వల్లే ఈ విధంగా తయారవుతున్నాయని ఇప్పటికే పలు అధ్యాయనాల ద్వారా వెల్లడైంది. ఈ నేపథ్యంలో వాహన కాలుష్యాన్ని అరికట్టేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది.

# మొయినాబాద్ డ్రగ్స్ కేసు: సిట్ విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి..

హైదరాబాద్ , న్యూస్‌వార్ ప్రతినిధి

బీఆర్ఎస్ తాండూరు మాజీ ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డికి చెందిన మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో వెలుగుచూసిన డ్రగ్స్ పార్టీ వ్యవహారంపై శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ కేంద్రంగా సిట్ విచారణ ముమ్మరంగా సాగుతోంది. నిందితుల వాంగ్మూలాలు ఈ కేసును మరో మలుపు తిప్పాయి. ముగ్గురు నిందితులను విడివిడిగా విచారిస్తున్న సిట్ బృందం పలు సంచలన విషయాలను రాబట్టింది. ప్రధాన నిందితుడు రోహిత్ రెడ్డి గత ఏడాది కాలంగా క్రమం తప్పకుండా డ్రగ్స్ తీసుకుంటున్నట్లు సిట్ అధికారులు గుర్తించారు.

### తప్పుదోవ పట్టించిన కౌశిక్ రవి..

ఈ కేసులో డ్రగ్స్ సరఫరా చేసిన అభిషేక్ సింగ్ అత్యంత కీలకంగా మారాడు. రోహిత్ రెడ్డి ఆదేశాల మేరకు అతని డ్రైవర్ సిలివేరి శరత్, అవుటర్ రింగ్ రోడ్ వద్ద అభిషేక్ నుంచి డ్రగ్స్ సేకరించినట్లు సిట్ విచారణలో తేలింది. నిందితుల్లో ఒకరైన కౌశిక్ రవి, డ్రగ్స్ సిమ్లా నుంచి తెచ్చినట్లు పోలీసులకు చెప్పి దర్యాప్తును పక్కదారి పట్టించే ప్రయత్నం చేశాడు. అయితే, సిట్ తనదైన శైలిలో విచారించడంతో అసలు విషయం బయటపడింది.

### మిస్టరీగా మారిన పెడ్లర్ అభిషేక్ సింగ్ పరారీ

డ్రగ్స్ పార్టీ వ్యవహారం బయటకు రాగానే పెడ్లర్ అభిషేక్ సింగ్ అదృశ్యమయ్యాడు. ఈ నెల 16 నుంచి తన కుమారుడు కనిపించడం లేదని అభిషేక్ తండ్రి రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం అభిషేక్ పరారీలో ఉన్నాడని, అతనిని పట్టుకుంటే ఈ డ్రగ్స్ నెట్‌వర్క్‌లో ఉన్న మరికొంతమంది ప్రముఖుల పేర్లు బయటపడే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

### సిట్ తదుపరి చర్యలు

నిందితులను ఘటనా స్థలానికి తీసుకెళ్లి సీన్ రీ-కన్స్ట్రక్షన్ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. నిందితుల మొబైల్ ఫోన్లలోని కాల్ డేటా, వాట్సాప్ చాట్‌లను ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపారు. రోహిత్ రెడ్డి రక్త నమూనాలను సేకరించి, డ్రగ్స్ తీసుకున్న సమయాన్ని, రకాన్ని శాస్త్రీయంగా నిర్ధారించనున్నారు. ఈ కేసులో సెలబ్రిటీలు లేదా రాజకీయ ప్రముఖుల ప్రమేయం ఉందా అనే కోణంలో కూడా సిట్ ఆరా తీస్తోంది. అభిషేక్ సింగ్ దొరికితే ఈ కేసులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉంది.

# ఇరాన్ యుద్ధం.. రంగంలోకి సౌదీ అరేబియా, యూఏఈ..

న్యూస్‌వార్ ప్రతినిధి

ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడులను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాయిదా వేయడంతో ప్రపంచ దేశాలకు కాస్త ఉపశమనం లభించింది. ఇలాం టి తరుణంలో ప్రముఖ 'వాల్‌స్ట్రీట్' జర్నల్ ప్రచురించిన ఓ కథనం సంచల నంగా మారింది. ఇరాన్‌తో అమెరికా సాగిస్తున్న యుద్ధంలో సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పాల్గొనేందుకు సిద్ధమవుతున్నట్టు 'వాల్‌స్ట్రీట్' జర్నల్ పేర్కొంది. తమ వైమానిక స్థావరాల నుంచి ఇరాన్‌పై దాడులు చేయడానికి ఇప్పటివరకు అమెరికాకు అనుమతి ఇవ్వని సౌదీ అరేబియా.. తాజాగా మనసు మార్చుకున్నట్టు ఆ కథనం పేర్కొంది. తమ వైమానిక స్థావరాల నుంచి ఇరాన్‌పై దాడులు చేసేందుకు అగ్రరాజ్యానికి సౌదీ అరేబియా అనుమతినిచ్చిందట. మరోవైపు, తమ దేశంలోని ఇరాన్‌కు చెందిన ఓ హాస్పిటల్‌ను, క్లబ్‌ను యూఏఈ మూసేసింది. ఈ పరిణామాలు చూస్తుంటే అమెరికాకు సౌదీ అరేబియా, యూఏఈ ప్రత్యక్షంగా సహకరించేందుకు ముం దుకు వస్తున్నట్టు అర్థమవుతోందని 'వాల్‌స్ట్రీట్' పేర్కొంది. పశ్చిమాసియాలో సుదీర్ఘంగా జరుగుతున్న యుద్ధం వల్ల తమ ఆర్థిక వ్యవస్థలు భారీగా నష్టపోతు న్నాయని గల్ఫ్ దేశాలు ఆందోళన చెందుతున్నాయి. చమురు సరఫరాలో కీలకమైన హోర్ముజ్ జలసంధిని ఇరాన్ నియంత్రించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికాకు మద్దతు ఇచ్చి హోర్ముజ్ జలసంధిపై ఆటంకాలు త్వరగా తొలిగిపోయేలా చేయాలని భావిస్తున్నాయట. అయితే ఈ వార్తలపై అమెరికా నుంచి ఇప్పటివరకు స్పందన లేదు.

# వెళ్తున్నానని తెలిసి.. అలా వచ్చి వెళ్లారు: జీవన్ రెడ్డి

జగిత్యాల, న్యూస్‌వార్ ప్రతినిధి

తన పదేళ్ల ఒంటరి పోరును పార్టీ అధిష్ఠానం చిన్నచూపు చూసిందని మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తనకు పీసీసీ చీఫ్ పదవి రాకున్నా.. పార్టీ అధికారంలోకి వచ్చినందుకు సంతోషపడ్డానన్నారు. మంగళవా రం జగిత్యాలలోని తన నివాసానికి పార్టీ అధిష్ఠానం పంపిన దూతలతో సమావేశమయ్యారు. ఈ సమావేశం అనంతరం టి. జీవన్ రెడ్డి మాట్లా డుతూ.. రాజకీయాల్లో తనది పూలబాట కాదని.. ముళ్ల బాట అని స్పష్టం చేశారు. పీసీసీ చీఫ్ కాబట్టి రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి, సీఎల్పీ లీడర్ కాబట్టి భట్టి విక్రమార్కకు డిప్యూటీ సీఎం పదవి ఇచ్చారన్నారు. కానీ తాను శాసన మండలిలో నేతను అని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి గుర్తు చేశారు.మరి తనకెం దుకు అన్యాయం చేశారంటూ కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలను ఈ సందర్భంగా జీవన్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపుల్లో మనకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదర్శం కాదు కదా? అంటూ కాంగ్రెస్ నేతలకు ఆయన చరకలంటించారు. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచనలు ఏమిటి? మనం చేస్తున్నదేమిటంటూ రాష్ట్రంలోని పార్టీ నేతలను ఈ సందర్భంగా ఆయన సూటిగా నిలదీశారు.పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ వంటి నేతలు ఇచ్చిన హామీ అమలు కాకపోతే పార్టీ ఎందుకంటూ జీవన్ రెడ్డి ఈ సందర్భంగా కొంత అసహనం వ్యక్తం చేశారు. అధిష్ఠానం తనను బుజ్జగించలేదని చెప్పారు. తాను పార్టీ వీడి వెళ్తున్నానని తెలిసి.. అలా వచ్చి వెళ్లారంటూ కాంగ్రెస్ ప్రతినిధుల రాకపై జీవన్ రెడ్డి స్పందించారు.

# క్రైస్తవ మతంలోకి మారితే ఎస్సీ హోదా రద్దు: సుప్రీంకోర్టు సంచలన తీర్పు

న్యూఢిల్లీ: న్యూస్‌వార్ ప్రతినిధి

మతం మారిన వారి ఎస్సీ హోదాకు సంబంధించి సుప్రీం కోర్టు తాజాగా కీలక తీర్పు వెలువరించింది. క్రిస్టియన్ మతంలోకి మారాక ఎస్సీ హోదా ఉండదని పేర్కొంది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలు కాకుండా ఇతర మతాల్లోకి మారితే ఎస్సీ (రాజ) హోదా వర్తించదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్వీ అంజారియాలతో కూడిన ధర్మసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. ఈ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది.గుంటూరు జిల్లా పిట్టలవానిపాలెంలో పాస్టర్‌గా పనిచేస్తున్న వ్యక్తిపై దాడికి సంబంధించి ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద నమోదైన కేసులో సుప్రీం కోర్టు ఈ తీర్పు వెలువరించింది. ఫిర్యాదుదారుడు దశాబ్ద కాలంగా పాస్టర్‌గా ఉంటున్నారని, ఘటన జరిగిన సమయంలోనూ ప్రార్థనలు చేస్తున్నారని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. క్రైస్తవ మతంలో కుల వ్యవస్థకు తావులేదని, కాబట్టి అట్రాసిటీ చట్టం కింద ఫిర్యాదు చేసే హక్కు ఉండదని పేర్కొంది.ఫిర్యాదుదారుడికి తహశీల్దార్ ఇచ్చిన కుల ధ్రువీకరణ పత్రం ఉన్నప్పటికీ, మత మార్పిడి తర్వాత ఆ రక్షణ పొందేందుకు అర్హత ఉండదని సర్వోన్నత న్యాయస్థానం వెల్లడించింది. క్రైస్తవ మతంలోకి మారి, ఆ ఆచారాలను పాటిస్తున్న వ్యక్తి షెడ్యూల్డ్ కుల సభ్యుడిగా కొనసాగలేరని స్పష్టం చేసింది. రాజ్యాంగం (షెడ్యూల్డ్ కులాలు) ఆర్డర్, 1950 ఈ విషయాన్ని స్పష్టం చేస్తోందని సుప్రీం కోర్టు ధర్మాసనం పేర్కొంది. క్రైస్తవ మతంలోకి మారిన వ్యక్తికి ఎస్సీ, ఎస్టీ (అట్రాసిటీ నిరోధక) చట్టం కింద రక్షణ లభించదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

# ఒకవైపు శాంతి చర్చలు.. మరోవైపు దాడులు..

### ఇరాన్ నగరాలపై బాంబుల వర్షం..

ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడులను ఐదు రోజులు వాయిదా వేస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించగానే అంతర్జాతీయంగా కాస్త ఉపశమనం నెలకొంది. పలు దేశాల స్టాక్ మార్కెట్లు లాభాలు ఆర్జించాయి. చమురు ధరలు తగ్గాయి. యుద్ధం విషయంలో ట్రంప్ కాస్త వెనక్కి తగ్గినా ఇరాన్‌పై దాడులు మాత్రం ఆగడం లేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన తర్వాత కూడా ఇరాన్ నగరాలపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. మంగళవారం రాత్రి ఇరాన్‌లోని పలు నగరాలపై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు కొనసాగాయి. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో మంగళవారం రాత్రి భారీ పేలుళ్లు సంభవించాయి. తబ్రిజ్, ఇస్ఫహాన్, కరాజ్ నగరాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగాయి. ఇస్ఫహాన్‌లోని గ్యాస్ వ్యవస్థ, ఖొర్రమ్‌షహర్‌లోని పవర్ ప్లాంట్‌లను క్షిపణులు, డ్రోన్లు తాకాయి. ఈ దాడులను ఇజ్రాయెల్ చేసి ఉంటుందని ఇరాన్ భావిస్తోంది. ఈ దాడులపై అమెరికా, ఇజ్రాయెల్ ఇప్పటివరకు స్పష్టతనివ్వలేదు.మరోవైపు ఇజ్రాయెల్‌పై 78వ విడత దాడులను ప్రారంభించినట్టు ఐఆర్‌జీసీ తాజాగా ప్రకటించింది . ఇజ్రాయెలోని టెల్ అవివ్, డిమోనా, ఇలాట్‌తో పాటు పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నట్టు తెలిపింది. ఈ దాడుల్లో ఇజ్రాయెల్‌కు చెందిన పలు ప్రాంతాలు ధ్వంసమైనట్టు పేర్కొంది. మంగళవారం ఉదయం నుంచి పలు ఇజ్రాయెల్ నగరాల్లో సైరన్ల మోత మోగుతోంది.

# ఉప్పల్ స్టేడియానికి కొత్త కళ... రూ.10 కోట్లతో అభివృద్ధి చేసిన సన్ గ్రూప్

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

హైదరాబాద్‌లోని ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం సరికొత్త హంగులను సంతరించుకుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ యాజమాన్య సంస్థ అయిన సన్ గ్రూప్, స్టేడియం ఆధునికీకరణ పనులను భారీ ఎత్తున చేపట్టింది. ఈ పనుల కోసం రూ.10 కోట్లకు పైగా వ్యయం చేసినట్టు సన్ రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ తెలిపింది.ఈ ఆధునికీకరణలో భాగంగా స్టేడియంలోని ప్రేక్షకులు, సిబ్బందికి మెరుగైన సౌకర్యాలు కల్పించడంపై దృష్టి సారించారు. స్టేడియం వ్యాప్తంగా ఉన్న 46 టాయిలెట్లను, ఒక లాంజ్‌తో సహా 42 బాక్సులను పూర్తిగా పునరుద్ధరించారు. దీంతో పాటు, కొత్తగా రెండు ఎలివేటర్లను (లిఫ్టులు), 43 ఎయిర్ కండిషనర్లను (ఏసీలు) ఏర్పాటు చేశారు. ఈ మార్పులతో స్టేడియం సదుపాయాలు కొత్తరూపు సంతరించుకున్నాయి. స్టేడియంలో చేపట్టిన ఈ అభివృద్ధి పనుల వివరాలను సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ తమ అధికారిక సోషల్ మీడియా ఖాతాల ద్వారా వెల్లడించింది. రాబోయే క్రికెట్ మ్యాచ్‌లకు హాజరయ్యే అభిమానులకు ఈ కొత్త సౌకర్యాలు మెరుగైన అనుభూతిని అందించనున్నాయి.

# కేటీఆర్, రాజగోపాల్ రెడ్డి, పాయల్ శంకర్..

### ఒకే టేబుల్‌పై భోజనం, రెండు గంటలకు పైగా సమాలోచనలు

తెలంగాణ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు కలిసి భోజనం చేశారు. ఆ తర్వాత ముగ్గురు సరదాగా మాట్లాడుకున్నారు. మంగళవారం అసెంబ్లీలోని మెంబర్స్ లాంజ్‌లో ఈ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి, బీజేపీ శాసనసభ్యుడు పాయల్ శంకర్ ఒకే టేబుల్‌పై భోజనం చేశారు. ఆ తర్వాత అక్కడే చాలాసేపు వారు మాట్లాడుకున్నారు. రెండు గంటలకు పైగా వారి మధ్య సంభాషణలు జరగడం గమనార్హం. మూడు పార్టీలకు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు కలిసి సుదీర్ఘంగా మాట్లాడుకోవడం ఆసక్తిగా మారింది.

# అమరావతిలో అగ్నిప్రమాదాల వెనుక కుట్ర?

### రాయపూడి ఘటనపై సీఎం చంద్రబాబు హైలెవల్ రివ్యూ!

పనులు వేగవంతం అవుతున్న తరుణంలో, వరుసగా జరుగుతున్న అగ్నిప్రమాదాలు ప్రభుత్వానికి సవాల్‌గా మారాయి. నిన్న రాత్రి రాయపూడిలోని హెచ్‌వోడీ టవర్ల నిర్మాణ ప్రాంతంలో మేఘా సంస్థకు చెందిన భారీ ప్లాస్టిక్ పైపులు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటనపై ఈరోజు సచివాలయంలో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు... ఇది కేవలం ప్రమాదమా లేక ఎవరైనా కావాలని చేస్తున్న కుట్రనా అనే కోణంలో సమగ్ర విచారణ జరపాలని ఆదేశించారు.

సీఎం చంద్రబాబు వ్యక్తం చేసిన ప్రధాన సందేహాలు:

రాజధాని ప్రాంతంలో గత కొద్ది రోజులుగా మూడు సార్లు ఇలాంటి ప్రమాదాలు జరగడం యాదృచ్ఛికం కాదని సీఎం అభిప్రాయపడ్డారు. వివిధ కాంట్రాక్టు సంస్థలకు చెందిన కోట్లాది రూపాయల విలువైన నిర్మాణ సామగ్రి కాలిపోవడం వెనుక ఏదైనా లోతైన కుట్ర ఉందేమో తేల్చాలని చెప్పారు. వెలగపూడి సీడ్ యాక్సిస్ రోడ్ వద్ద కూడా గతంలో ఇలాగే పైపులు అగ్నికి ఆహుతయ్యాయని, ఇప్పటి వరకు ఇలాంటి ఘటనలు మూడు జరిగాయని, ఇది ఉద్దేశపూర్వక చర్యగా కనిపిస్తోందని అధికారులు ప్రాథమిక సమాచారం అందించారు.ఈ రోజు సాయంత్రం సీఆర్డీఏ అధికారులు, రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా భేటీ కానున్నారు. రాజధాని ప్రాంతంలో సెక్యూరిటీని మరింత కట్టుదిట్టం చేసేలా ఈ భేటీలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

రాయపూడిలో అసలేం జరిగింది?

అఖిల భారత సర్వీస్ అధికారుల ([illegible]) కోసం నిర్మిస్తున్న నివాస సముదాయాల సమీపంలో నిల్వ ఉంచిన భారీ పైపులు ఒక్కసారిగా తగులబడ్డాయి. ఆకాశాన్ని అంటేలా ఎగిసిపడిన మంటలను చూసి స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఫైర్ ఇంజన్లు రంగంలోకి దిగి మంటలను అదుపు చేసినప్పటికీ, అప్పటికే భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది.

న్యూస్ వార్ వార్తా పత్రిక

సంపాదకీయం...

# పసిప్రాయాన్ని కాటేస్తున్న హెచ్ఐవి

ఆరోగ్యవంతమైన పిల్లలతో సమాజ పురోగతి సాధ్యపడుతుంది. దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది. మెరుగైన కుటుంబానికి సోపానమవుతుంది. నవ్వుతూ తుళ్లుతూ చదువుకునే పిల్లలను చూస్తే ముచ్చటేస్తుంది. ఆ ముచ్చట ఎంతోకాలం కాదని తెలియక తల్లడిల్లే కుటుంబసభ్యుల వేదన అంతాఇంతా కాదు. చేయని తప్పులకు చిన్నారులు హెచ్ఐవి బారినపడుతూ దారుణమైన జీవితాన్ని అనుభవిస్తున్నారు. గర్భధారణ, ప్రసవం తదితర కారణాలతో చాలామంది పిల్లలు హెచ్ఐవి బారినపడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా 2024 నాటికి సుమారు 14 లక్షల మంది పిల్లలు 15 ఏళ్లలోపు హెచ్ఐవికి గురయ్యారు. మన దేశంలో తల్లి నుంచి బిడ్డకు, రక్తం ఎక్కించడం, అసురక్షిత రక్తమార్పిడి ద్వారా 5 శాతం మేరకు హెచ్ఐవి కేసులు వెలుగు చూస్తున్నాయి. హెచ్ఐవితో జీవిస్తున్న 15 ఏళ్లలోపు పిల్లల్లో సగానికిపైగా 'యాంటీరెట్రో వైరల్' మందులు వాడుతున్నారు. – ఇందిరమ్మ రాజ్యం దిశగా బడ్జెట్ రోగం వచ్చాక చికిత్స కోసం పరుగులు తీసేకన్నా ముందే రోగం రాకుండా చూసుకోవాలని వైద్యులు సూచిస్తుంటారు. నివారించదగ్గ జబ్బులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రచార కార్యక్రమాలు ప్రధానంగా తోడ్పడుతుంటాయి. అదే క్రమంలో హెచ్ఐవి, ఎయిడ్స్ రహిత సమాజంగా మార్చేందుకు దశాబ్దాల క్రితమే ప్రయత్నాలు మొదలయ్యాయి. అందులో భాగంగా ఆధునిక పరిశోధనల ఫలితాల వల్ల ప్రసవించి హెచ్ఐవి ఉన్న తల్లి నుంచి బిడ్డకు ఆ వ్యాధి సోకకుండా ముందుగానే గుర్తించే అవకాశం కలిగింది. దాన్ని సద్వినియోగం చేసుకునే క్రమంలో 21వ శతాబ్దం తొలినాటి నుంచి పైలెట్ ప్రాజెక్టుగా మొదలై 25 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ హెచ్ఐవితో పిల్లలు జన్మిస్తుండడం బాధాకరం. దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లో నమోదవుతున్న కేసుల సంఖ్య ఆందోళనకరంగా మారింది. రోగులపట్ల సమాజంలో నెలకొన్న వివక్ష ఇందుకు కారణంగా తెలుస్తోంది. హెచ్ఐవి గుర్తించిన పిల్లలకు 'యాంటీ రెట్రో వైరల్' ద్వారా మందులతో సహాయం చేస్తూ వారి జీవితకాలాన్ని పొడిగించే ప్రయత్నం చేస్తున్నారు. పేద, దిగువ మధ్యతరగతి ప్రజలకు ఈ మందుపై అవగాహన కొరవడడం, అందకపోవడంతో చాలా మంది పిల్లలు మరణిస్తున్నారు. రాజకీయాలకు డ్రగ్స్ పంకిలం.. పార్టీ పెద్దల ఉదాసీనం రోగనిరోధక శక్తిని బలహీనపరిచే వైరస్ హెచ్ఐవి. దీని వల్ల శరీరం ఇన్ఫెక్షన్లు, కేన్సర్‌తో పోరాడే సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. చికిత్స అందకపోతే శరీరంలో హెచ్ఐవి పునరుత్పత్తి చెందుతూ ఉంటుంది. దీంతో దీర్ఘకాలిక అనారోగ్యానికి గురై చివరకు మరణిస్తారు. ఈ వైరస్ సోకిన పిల్లలు చికిత్సలేకుండా ఐదేళ్ల వయస్సు వరకు జీవించే అవకాశముంటుంది. గర్భిణీనుంచి బిడ్డకు వ్యాపించే హైచ్ఐవి వైరస్ వ్యాప్తిని ప్రస్తుతం అందుబాటులో ఉన్న చికిత్సల ద్వారా నివారించవచ్చు. ప్రపంచవ్యాప్తంగా వైరస్‌ను అరికట్టడంలో పురోగతి ఉన్నప్పటికీ, కొన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఇప్పటికీ అధిక సంఖ్యలో పిల్లలు ఇన్ఫెక్షన్లకు గురవుతున్నారు. 90 శాతం మేరకు తల్లినుంచి సంక్రమిస్తున్నాయి. కలుషిత సూదుల వాడుక, రక్తమార్పిడిలో జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల జరుగుతున్నాయి. 84 శాతంకు పైగా సబ్ సహారా ఆఫ్రికాలోని పిల్లలకు సోకుతున్నాయి. 2024 నాటికి 55 శాతం మంది పిల్లలకు మాత్రమే చికిత్స అందాయి. చికిత్స అందక సగం మంది పిల్లలు రెండేళ్లలోపు వయస్సులోనే మరణిస్తున్నారు. మన దేశంలో తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవి సంక్రమణ 74.6 శాతంకు తగ్గింది. ఇది ప్రపంచ సగటు కంటే చాలా ఎక్కువ కావడం ఊరట కలిగించే విషయం. అయినప్పటికీ మిజోరాం, నాగాలాండ్ వంటి ఈశాన్య రాష్ట్రాలలో హెచ్ఐవి వైరస్ వ్యాప్తి రేటు ఒక శాతానికి ఎక్కువగా ఉండటం, అలాగే అరుణాచల్‌ప్రదేశ్, త్రిపుర, మేఘాలయ, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో కొత్త కేసుల సంఖ్య గణనీయంగా పెరగడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. బీహార్ వంటి కొన్ని ప్రాంతాలలో హెచ్ఐవి పాజిటివ్ తల్లిదండ్రుల నుంచి పిల్లలకు వైరస్ సంక్రమిస్తున్న కేసులు మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. నాలుగైదు నెలల క్రితం బీహార్ రాష్ట్రంలోని సీతామఢి జిల్లాలో ఏకంగా 7,400 హెచ్ఐవి కేసులు నమోదుకాగా, అందులో 400 మందికి పైగా చిన్నారులు ఉండడం కలకలం సృష్టించింది. ఇజ్రాయెల్ అణ్వస్త్రదాడి చేసేనా? తల్లిదండ్రుల కారణంగానే ఈ వైరస్ సోకినట్లు వైద్యులు నిర్ధారించగా, ఒక్క కేంద్రంలోనే నెలకు 40 నుంచి 60 కొత్త కేసులు నమోదవుతున్నాయి. వైద్య పరీక్షలు చేసుకోకుండానే పెళ్లి చేసుకోవడం, ఉపాధి కోసం వలసలు వెళ్లడం, సామాజిక వివక్ష తదితర కారణాలు వైరస్ వ్యాప్తికి కారణమవుతున్నట్లు అధికారులు తేల్చారు. సురక్షిత లైంగిక పద్ధతులు, కలుషిత సూదుల వినియోగం, క్రమం తప్పకుండా హెచ్ఐవి పరీక్షలు చేసుకోవడంపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను అక్కడ ముమ్మరం చేశారు. మానవత్వాన్ని ప్రశ్నించే సంఘటన మధ్యప్రదేశ్‌లోని సత్నాలో చోటు చేసుకుంది. చేయని తప్పుకు ఆరుగురు చిన్నారులు హెచ్ఐవి బారినపడ్డారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులను తల్లిదండ్రులు సత్నా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. దాతల నుంచి సేకరించిన రక్తంను ఆ పిల్లలకు ఎక్కించిన కొద్ది రోజులకే అనారోగ్యానికి గురయ్యారు. ఉన్నతాధికారుల దర్యాప్తులో ఆ పిల్లలకు హెచ్ఐవి సోకినట్లు నిర్ధారణ అయింది. ప్రభుత్వ నివేదికల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో 2024 నాటికి 2,22,338 హెచ్ఐవి కేసులు నమోదుకాగా, ఇందులో 90 శాతం 15 49 ఏళ్ల మధ్య వయస్సు వారున్నారు. మరిన్ని కనుగొనండి జర్నలిజం కోర్సు కరీంనగర్ వార్తలు లైఫ్ స్టైల్ హెచ్ఐవి వంటి ప్రాణాంతక వ్యాధులను నియంత్రించడం ఆరోగ్య రంగానికి పెను సవాలుగా మారిన సందర్భంలో డెన్మార్క్ ఒక చారిత్రాత్మక విజయాన్ని అక్కునజేర్చుకుంది. తల్లి నుంచి పుట్టబోయే బిడ్డకు హెచ్ఐవి, సిఫిలిస్ వంటి వ్యాధులు సంక్రమించకుండా అడ్డుకోవడంలో ఆ దేశం విజయం సాధించింది. కొన్నేళ్లుగా అమలు చేస్తున్న సమర్థవంతమైన ఆరోగ్య విధానాలు, గర్భిణీ స్త్రీలపై ప్రత్యేక వైద్య




పర్యవేక్షణ ఈ విజయానికి కారణమయ్యాయి. 'యాంటీ రెట్రో వైరల్' చికిత్సతోపాటు మెరుగైన వైద్యసేవలు అందిస్తే ఈ ప్రమాదాన్ని అరికట్టవచ్చునని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఒ) వెల్లడించింది. దీన్ని డెన్మార్క్ అమలు చేయడంతో ఆరోగ్య రంగంలో పెద్ద మైలురాయిగా ఫిబ్రవరి 27, 2026న ఆ సంస్థ విడుదల చేసిన అధికార ప్రకటనలో పేర్కొంది. డెన్మార్క్ సూత్రాన్ని అమలు చేయడంలో క్యూబా, థాయిలాండ్ వంటి దేశాలు పాటు పడుతున్నాయి. భారత్ వంటి దేశాల్లో తల్లి నుంచి బిడ్డకు వ్యాధి సంక్రమణను అడ్డుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ, డెన్మార్క్ బాటలో నడచినప్పుడే ఫలితాలు అందుతాయని డబ్ల్యూహెచ్ఒ స్పష్టం చేసింది.

# అమరావతిలో వరుస అగ్నిప్రమాదాలు

## కుట్రకోణంపై దర్యాప్తు: హోంమంత్రి

**అమరావతి,**

రాజధాని అమరావతిపై ఎవరు కుట్రలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. అమరావతిలో వరుసగా అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోవడం.. అది కూడా ఒకే తరహాలో జరుగుతుండటంపై విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. మంగళవారం రాజధాని అమరావతిలో మంత్రి అనిత విలేకర్లతో మాట్లాడుతూ.. అమరావతిలోని రాయపూడి సమీపంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శుల బంగ్లాల వద్ద గత అర్ధరాత్రి జరిగిన భారీ అగ్నిప్రమాదాన్ని.. ఐదు అగ్నిమాపక శకటాలతో చాలా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. అమరావతిలో ఇటీవల జిల్లా



కలెక్టర్ల సదస్సు నిర్వహించారన్నారు. ఆ రోజు సైతం జరిగిన అగ్నిప్రమాదం కూడా ఉద్దేశపూర్వకంగా జరిగిందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. అమరావతి ప్రాంతంలో గత కొద్ది రోజులుగా వర్షం కురిసినందున ఈ తరహా ఘటనలు జరగటానికి అవకాశాలు చాలా స్వల్పమని మంత్రి అనిత అభిప్రాయపడ్డారు. ÷రిళిమవారం అనకాపల్లి జిల్లాలో ఆర్సెల్లార్ మిట్టల్ ఉక్కు పరిశ్రమకు భూమి పూజ ఘనంగా జరిగిందని.. దీన్ని చూసి ఓర్వలేక రాజధానిలో పైపులకు నిప్పు పెట్టారా? అనే అనుమానాలు రేకెత్తుతున్నాయని మంత్రి అనిత సందేహం వ్యక్తం చేశారు. గతంలో రాజధాని అమరావతి నిర్మాణాన్ని ఓర్వలేక అరటితోటకు నిప్పు పెట్టిన ఉదాహరణలు ఉన్నాయని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. ఈ ప్రమాదంపై పోలీసు శాఖ అన్ని కోణాల్లో విచారణ చేస్తోందని మంత్రి అనిత వివరించారు.

## భద్రాద్రిలో కళ్యాణోత్సవానికి భారీగా ఏర్పాట్లు

### 27న కళ్యాణం, 28న పట్టాభిషేక మహోత్సవాలు

**భద్రాచలం,**

భద్రగిరిలో శ్రీరామనవమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేం దుకు చురుకుగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈ మేరకు జిల్లా యంత్రాంగం నిమగ్నమయ్యింది. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని ప్రభుత్వం కూడా ఆదేశించింది. గవర్నర్, సిఎంలకు కూడా ఇప్పటికే ఆహ్వానాలు అందచేశారు. 27న జరిగే సీతారాముల కల్యాణం, 28న జరిగే మహా పట్టాభిషేకం కార్యక్రమాలను ఎలాంటి లోటుపాట్లు, అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా పూర్తిచేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ అధికారులను ఆదేశించారు. దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావుతో కలిసి ఆమె హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ నిర్వంహించారు. ఈ వీసీకి భద్రాచలం సబ్‌కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్ అంకిత్, సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ హాజరయ్యారు. ఈ సందర్భంగా శైలజారామయ్యర్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి తగిన కార్యాచరణతో పని చేయాలన్నారు. ఇక నవమి రోజున 27న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భద్రాద్రి రానున్నారని, అదేరోజు ఆయన చేతుల మీదుగా ఆలయాభివృద్ధి పనులకు భూమి పూజ కార్యక్రమం ఉంటుందని.. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లతో పాటు శిలాఫలం ఏర్పాటు పనులు పూర్తి



చేయాలన్నారు. ఇక పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ , తదిత భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. మిథిలా స్టేడియంలో ప్రజాప్రతినిధులు, వీవీఐపీలు, వీఐపీలతో పాటు రామయ్య దర్శనానికి వచ్చే సాధారణ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. శిఇప3.తూణభద్రాచలంలో మిథిలా స్టేడియంలో జరుగుతున్న శ్రీరామనవమి ఏర్పాట్లను కలెక్టర్ అంకిత్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేడియంలో విధులు నిర్వహించే సెక్టార్ అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. 26న ఉదయం 9గంటల వరకు సబ్‌కలెక్టరు కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. సక్రమంగా విధులు నిర్వహించాలని, భక్తులకు అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. వీవీఐపీ, వీఐపీలకు బస చేసే అతిథి గృహాలకు నియమితులైన సెక్టారల్ అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, చిన్న పిల్లలు, మహిళలు, సీనియర్ సిటిజన్లు, అనారోగ్యంతో ఉన్న వారి పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీఐపీల వెంట వచ్చే సిబ్బంది ఎవరైనా గొడవలకు దిగితే పోలీసు సహకారం తీసుకొని సర్దుబాటు చేయాలని, దేవుడి దగ్గర అందరూ సమానమే అన్నారు. ఈ కార్యక్రమాల్లో జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్, ఐటీడీఏ పీవో బి.రాహుల్, ఎస్పీ రోహిత్‌రాజు, సబ్‌కలెక్టర్ మృణాల్‌శ్రేష్ఠ, శిక్షణ కలెక్టర్ సౌరభ్ శర్మ, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, డీఆర్‌డీవో విద్యాచందన, తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగనున్న ఆర్డీటి సేవలు

### కేంద్రం అనుమతితో యధావిధిగా కార్యక్రమాలు

**అమరావతి,**

తెలుగు రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న ఆర్డీటీ కార్యకలాపాలు ఇకపై నిరంతరాయంగా కొనసాగనున్నాయి. ఆర్డీటీ సేవలు ఆగిపోకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వంతో ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ ప్రకారం ఆర్డీటీకి అవసరమైన అనుమతులు మంజూరయ్యాయి. దీంతో సంస్థకు ఎదురైన పరిపాలనా అడ్డంకులు తొలగిపోయాయి. ఆర్డీటీ డైరెక్టర్ మంచో ఫెర్రర్ స్థాపించిన ఈ సంస్థ ద్వారా దశాబ్దాలుగా తెలుగు రాష్ట్రాల్లో అందుతున్న సేవలు వెలకట్టలేనివి.అనంతపురం జిల్లాతో పాటు యావత్ రాయలసీమ ప్రాంత అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ కు కేంద్ర ప్రభుత్వం నుంచి ఈఅఖీం పునరుద్ధరణ లభించడం ఒక చారిత్రాత్మక విజయంగా నిలిచింది. అనంతపురం జిల్లా సామాజిక, ఆర్థిక చిత్రపటాన్ని మార్చేసిన ఆర్డీటీ సంస్థకు ఉన్న అతిపెద్ద అడ్డంకి తొలగిపోయింది. విదేశీ నిధుల సేకరణకు అవసరమైన ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్‌ను కేంద్ర ప్రభుత్వం మార్చి 22, 2031 వరకు పొడిగిస్తూ అధికారికంగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది.

## ఏపిలో ఉగ్రలింకుల కలకలం

### విజయవాడలో ముగ్గురు యువకుల అరెస్ట్

**విజయవాడ,**

ఏపీలో ఉగ్రలింకులు కలకలం రేపాయి. ఉగ్రవాద కార్యకలాపాలతో సంబంధాలున్నాయనే అనుమానంతో విజయవాడలో ముగ్గురు యువకులను ఏపీ కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వించిపేటకు చెందిన ఇద్దరు 21 ఏళ్ల యువకులతో పాటు, భవానీపురానికి చెందిన 20 ఏళ్ల యువకుడిని అరెస్టు చేసి రహస్యంగా విచారిస్తున్నారు.దేశవ్యాప్తంగా ఉగ్రమూలాలపై కేంద్ర నిఘా సంస్థల హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు నిరంతర నిఘా పెట్టారు. ఇందులో భాగంగా సోషల్‌మీడియా కార్యకలాపాలపైనా దృష్టిసారించారు. ఈ క్రమంలో ముగ్గురు యువకులు ఉగ్రవాద సంస్థలకు అనుకూలంగా పోస్టులు పెడుతున్నట్లు గుర్తించారు. దీంతో వెంటనే రంగంలోకి దిగిన ఇంటెలిజెన్స్ పోలీసులు.. వారి నివాసాల్లో సోదాలు నిర్వహించారు. అనంతరం వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా, విదేశాల్లో ఉగ్రవాద చర్యలకు ఆకర్షితులై సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టినట్లుగా ముగ్గురు యువకులు ప్రాథమిక విచారణలో అంగీకరించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వీరిని రహస్యప్రదేశంలో విచారిస్తున్నారు. వీరికి ఏ ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయి? వీరిని ఉగ్రవాదం వైపు ఎవరు ప్రేరేపిస్తున్నారు? వీరికి సోషల్‌మీడియా లింకులు ఎలా వస్తున్నాయన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. విజయవాడ టెర్రర్‌కు హైదరాబాద్‌తో సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఉగ్ర కార్యకలాపాలతో సంబంధాలు ఉన్నాయని అనుమానిస్తున్న ముగ్గురు యువకులకు హైదరాబాద్‌కు చెందిన మహిళతో సంబంధాలు ఉన్నట్లుగా సమాచారం. ఆ మహిళే కీలక సూత్రధారి అని పోలీసులు భావిస్తున్నారు. విజయవాడలో ముగ్గురు అనుమానితుల్ని అరెస్టు చేసిన వెంటనే.. ఆమె పరారవ్వడం ఇప్పుడు పలు అనుమానాలకు తావిస్తోంది.

## అమరావతిలో మరోమారు అగ్నిప్రమాదం

### వరుస ప్రమాదాలపై చంద్రబాబు అనుమానం

### దర్యాప్తు చేసి నిగ్గు తేల్చాలని ఆదేశం

**అమరావతి,**

రాజధాని అమరావతిలో మరోసారి భారీ అగ్నిప్రమాదం జరిగింది. సోమవారం రాత్రి రాయపూడి సమీపంలో ప్రిన్సిపల్ సెక్రటరీల భవనాల వద్ద నిర్మాణ ప్రాంగణంలో చోటు చేసుకుంది. కాంట్రాక్టు సంస్థ మేఘా కంపెనీకి చెందిన ప్లాస్టిక్ పైపుల వద్ద అకస్మాత్తుగా నిప్పులు చెలరేగాయి. దీంతో భారీగా మంటలు ఎగిసిపడటంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలుముకుంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ప్రమాద స్థలికి చేరుకుని సహాయక చర్యలను సమీక్షించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. కాగా అమరావతిలో ఇటీవల కూడా భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ నెల 11న ఎల్ అండ్ టీకి చెందిన ప్లాస్టిక్ పైపులు తగలబడటంతో కోట్లాది రూపాయల నష్టం జరిగింది. రాజధాని అమరావతిలోని ప్రాంతం రాయపూడిలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సచివాలయంలో మంగళవారం సమీక్ష చేశారు. రాయపూడిలో హెచ్‌వోడీ టవర్ల నిర్మాణం వద్ద మెగా సంస్థకు చెందిన ప్లాస్టిక్ పైపులు రాత్రి దగ్ధమైన ఘటనపై ప్రాథమిక సమాచారాన్ని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. రాజధాని ప్రాంతంలో తరుచూ అగ్రిప్రమాదాలు జరగడంపై సీఎం అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రమాదమా, కుట్రకోణం ఉందా అనే విషయంలో సమగ్ర విచారణ జరపాలని అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే మూడు ఘటనల్లో వివిధ కాంట్రాక్టు సంస్థలకు చెందిన నిర్మాణ సామాగ్రి దగ్ధమైందని తెలిపారు. రాజధాని అమరావతిలోని రాయపూడి వద్ద నూతనంగా నిర్మిస్తున్న అఖిల భారత సర్వీస్ అధికారుల టవర్ల సమీపంలో పైపులు కాలిపోయాయి. ఇది ప్రమాదమా...?, కుట్రకోణమా అనే దానిపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఇటీవల వెలగపూడి సమీపంలో సీడ్ యాక్సిస్ రోడ్ వద్ద కొందరు ఉద్దేశపూర్వకంగా పైపులకు నిప్పు పెట్టినట్లు అనుమానాలు వ్యక్తం అయ్యాయి. అలాగే మెగా సంస్థకు చెందిన పైపులకు కొందరు ఉద్దేశపూర్వకంగా నిప్పు పెట్టారా అనే కోణంలోనూ పోలీసులు విచారణ చేపట్టారు.

## రీజనల్ స్పోర్ట్స్ ఆఫీసర్‌గా రింకూ సింగ్

**లక్నో,**

టీమిండియా పవర్ హిట్టర్, టీ20 ప్రపంచ కప్ 2026 విజేత రింకు సింగ్‌కు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం నుంచి అరుదైన గౌరవం లభించింది. అతడిని రీజనల్ స్పోర్ట్స్ ఆఫీసర్‌గా యోగి సర్కార్ నియమించింది. ఈ మేరకు మంగళవారం లఖ్‌నవూలోని లోక్ భవన్ లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో నియామక పత్రాన్ని రింకుకు సీఎం యోగి ఆదిత్య నాథ్ అందజేశారు. పొట్టి ప్రపంచం కప్ సమయంలోనే రింకు తండ్రి మరణించిన సంగతి తెలిసిందే. అంతటి విషాదంలో ఉండి కూడా తండ్రి అంత్యక్రియలు ముగిసిన వెంటనే తిరిగి జట్టుతో చేరి తన అంకిత భావాన్ని చాటుకున్నాడు. రింకు టీ20 ప్రపంచ కప్ 2026లో మొత్తం 5 ఇన్నింగ్స్‌లో 24 పరుగులు మాత్రమే చేశాడు. ఈ అన్ని మ్యాచ్‌లలో అతడు ఆఖరిలో బ్యాటింగ్‌కు వచ్చాడు. పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో కేవలం 4 బంతుల్లోనే 11 పరుగులు చేశాడు.

4

నల్లగొండ

బుధవారం,
25 మార్చి 2026

న్యూస్ వార్
వార్తా పత్రిక

# జెడ్పీ సీఈఓ ఆకస్మిక తనిఖీ



ఆసుపత్రి, ఎంపీడీవో
కార్యాలయాల పరిశీలన



రికార్డులు పక్కాగా ఉండాలి
అధికారులకు జెడ్పీ సీఈఓ
శోభారాణి ఆదేశం
ఉపాధి హామీ పనులపై సమీక్ష

యాదాద్రి భువనగిరి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎన్. శోభారాణి మంగళవారం నారాయణపూర్ మండలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి, అక్కడి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రిలోని వార్డులను, మెడికల్ స్టోర్ విభాగాన్ని సందర్శించిన సీఈఓ, రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. మందుల నిల్వలు, రికార్డుల నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి, 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పాలనాపరమైన రికార్డులను తనిఖీ చేశారు. ఉపాధి హామీ పథకం సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమై, పనుల పురోగతిపై చర్చించారు. లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె. ప్రమోద్ కుమార్, కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టి.పి.ఎస్ స్కూల్ ను చందూరులోనే ఏర్పాటు చేయండి

డీఏఓ కు వినతిపత్రం
సమర్పించిన బిఆర్ఎస్ నాయకులు




**న్యూస్ వార్ చండూరు మార్చి 24:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరం నుండి అత్యాధునిక హంగులతో 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' పేరుతో రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న 100 పబ్లిక్ స్కూల్లో ఒక స్కూల్ ను తప్పనిసరిగాచండూరు పట్టణంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈరోజు ఆర్డీవో కార్యాలయంలో డిఏఓ పద్మకు వినతి పత్రం సమర్పించడం జరిగింది . ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు కొత్త పాటి సతీష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆలోచన విధానానికి తగ్గట్టుగా ప్రీ-ప్రైమరీ నుండి 12 తరగతులకు విస్తరించేందుకు చండూర్ హై స్కూల్ అన్ని విధాలుగా అనుకూలంగా ఉందని కాబట్టి చండూర్ హైస్కూల్లోనే తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను ఏర్పాటు చేయాలని కోరారు. మాజీ మున్సిపల్ చైర్మన్ తోకల వెంకన్న మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో మోడల్ స్కూల్స్ గురుకుల పాఠశాలలో ఉన్నప్పటికిని ఒక్క చండూరులోనే నాణ్యమైన వసతులతో కూడిన ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయకపోవడం శోచనీయమని ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడానికి తెలంగాణ ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరం నుంచి అత్యాధునిక తరగతి గదులు, డిజిటల్ లెర్నింగ్ ఏఐ బోధనతో కూడిన విద్యను నాణ్యమైన ఆహారంతొపాటు విద్యార్థులకు కావాల్సిన అన్ని వసతులతో ఏర్పాటు చేసే తెలంగాణ పబ్లిక్ స్కూల్ కు ఈ వార్షిక బడ్జెట్లో 500 కోట్లు కేటాయించడం సంతోషమని కాని దీనిని ఆచరణలో పెట్టి విద్యార్థులను తీర్చిదిద్దితే చాలా సంతోషిస్తామని తెలియచేస్తూ ప్రైవేట్ పాఠశాలలో ఫీజులు చెల్లించి పిల్లలకు విద్యాభ్యాసం చేయించలేక ఎంతో మంది తల్లిదండ్రులు బాధలు పడుతున్నారని కాబట్టి ప్రభుత్వం ఏర్పాటు చేసే 100 స్కూళ్లలో ఒక స్కూల్ ను తప్పకుండా చండూరు పట్టణంలో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కొండ్రెడ్డి మధు, బిఆర్ఎస్ పార్టీ మండల అధికార ప్రతినిధి బొడ్డు సతీష్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ మండల కార్మిక విభాగం అధ్యక్షులు చొప్పరి దశరథ యాదవ్, కర్నాటి మల్లేష్,ఇరిగి గురునాథం, ఇరిగి రామకృష్ణ, ఇడికోజు నాగరాజు, రాపోలు జగదీష్,వీణ,గౌస్,వీణ, అబ్దుల్, నాగార్జున,భూతరాజు వెంకన్న, పడసనబోయిన పాండు తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ విజేతలకు బహుమతి ప్రధానోత్సవం

న్యూస్ వార్ చౌటుప్పల్ మార్చి 24 స్వాతంత్ర సమరయోధుడు భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా స్థానిక భగత్ సింగ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలలో గెలుపొందిన విజేతలకు ఈరోజు బహుమతి ప్రధానోత్సవం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మున్సిపల్ కౌన్సిలర్ ఆల చిరంజీవి మాట్లాడుతూ యువత భగత్ సింగ్ ఆదర్శంగా తమ జీవితాన్ని స్ఫూర్తిదాయకంగా మలుచుకోవాలని కోరారు, ఈ సందర్భంగా కౌన్సిలర్ బత్తుల జయమ్మ దాస్ యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా, ఆన్లైన్ బెట్టింగ్లో వంటి వ్యసనాలకు లోను కాకుండా ఒక లక్ష్యంతో జీవితాన్ని దిద్దుకోవాలని సూచించారు ఈ పోటీలో మల్కాపురం గ్రామానికి చెందిన రంగారెడ్డి టీం మొదటి విజేతగా తంగడపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్ టీం రెండో విజేతగా బహుమతులను గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మున్సిపల్ నాయకులు బండారి. నరసింహ, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బోయ.లింగస్వామి, భగత్ సింగ్ క్రికెట్ టోర్నమెంట్ ఆర్గనైజర్స్ తూర్పునూరు మల్లేష్ గౌడ్ నక్క లింగస్వామి లగోని లింగస్వామి రొట్ట అనిల్ కుమార్ రాజ్ పెరియర్ బోయ అరవింద్ తదితరులు పాల్గొన్నారు




## ఘనంగా సీనియర్ పార్మాసిస్ట్ దుబ్బ దానమ్మ ఉద్యోగ విరమణ



యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని హోమియో ఆసుపత్రి లో పార్మసిస్ట్ గా సేవలందించి ఈనెల 31న ఉద్యోగ విరమణ పొందుతున్న దుబ్బ దానమ్మ ఉద్యోగ విరమణ కార్యక్రమం మంగళవారం భువనగిరి హోమియో ఆసుపత్రి లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా డైరెక్టర్లు జంపాల అంజయ్య, కొడారి వెంకటేష్ లు పార్మాసిస్ట్ దుబ్బ దానమ్మ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జంపాల అంజయ్య, కొడారి వెంకటేష్ లు మాట్లాడుతూ గత 27 సంవత్సరాలుగా హోమియో ఆసుపత్రిలో సేవలందించిన దుబ్బ దానమ్మ సేవలను వారు కొనియాడారు. మృదు స్వభావిగా, ఉత్తమ ఉద్యోగిగా, ఆసుపత్రి కి వచ్చే పేషెంట్ లను ఆత్మీయంగా పలకరించే దుబ్బ దానమ్మ ,ఉద్యోగ విరమణ తరువాత ఆరోగ్యంగా ఉండాలని, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి హోమియోపతి ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంగీత, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాల భారతి, హోమియో ఆసుపత్రి సిబ్బంది, దుబ్బ దానమ్మ కుటుంబ సభ్యులు బంధువులు పాల్గొన్నారు.

## హరీష్ రావు కృషి ఫలితమే గట్ల మల్యాల పీహెచ్ఎస్సి

కెసిఆర్ హరీష్ రావు చిత్రపటాలకు పాలాభిషేకం



సిద్దిపేట నియోజకవర్గంలోని నంగునూరు మండలం గట్లమల్యాల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బీఆర్ఎస్వీ గ్రామ శాఖ అధ్యక్షుడు రంగు చింటూ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావుల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాజీ మంత్రి హరీష్ రావు దూరదృష్టితో వాగువతల గ్రామాలకు మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో నాడు రూ. 1.43 కోట్లతో ఆరు పడకల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేయించి పనులు పూర్తి చేశారని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన కట్టడాలకు ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు,ప్రారంభోత్సవాలు చేయడం విడ్డూరంగా ఉందని వారు విమర్శించారు.

## జాతీయ రహదారుల విస్తరణలో భూ సేకరణ త్వరగా పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

జిల్లాలో జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా చేపట్టిన భూసేకరణకు సంబంధించి దరఖాస్తుల పరిష్కారం పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రాజస్వ మండల అధికారి కార్యాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రావు తో కలిసి సందర్శించి దరఖాస్తుల పరిష్కారం వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, అభివృద్ధిలో భాగంగా భారత జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన 63, 163జి రహదారుల ఏర్పాటులో భాగంగా జిల్లాలోని ప్రాంతాలకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కార చర్యలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ముఫ్త్ బిజిలి యోజన ద్వారా సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం ద్వారా దేశవ్యాప్తంగా 1 కోటి కుటుంబాలకు లబ్ధి చేకూర్చి విద్యుత్ బిల్లులను తగ్గించడమే లక్ష్యంగా సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన ప్రచార వాహనాన్ని రెడ్ కో ఆదిలాబాద్ డిఎంఎల్ శ్రీనివాస్, టిజిఎన్ పిడిసిఎల్ఎస్ఈ రాజన్న ఇతర అధికారులతో కలిసి ప్రారంభించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ముఫ్త్ బిజిలి యోజన పథకం ద్వారా గృహ విద్యుత్ వినియోగదారులు తమ ఇండ్ల రూఫ్ టాప్ పై సోలార్ ప్లాంట్ ను ఏర్పాటు చేసుకుని ప్రతి నెల 360 యూనిట్ల వరకు విద్యుత్




పొందవచ్చని తెలిపారు. దేశవ్యాప్తంగా 1 కోటి కుటుంబాలకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా పథకం అమలు చేయడం జరుగుతుందని, 1 కిలో వాట్ కు 30 వేల రూపాయలు, 2 కిలో వాట్లకు 60 వేల రూపాయల రాయితీ కాగా, 18 వేల రూపాయల వరకు ప్రతి కిలోవాట్ కు, జిహెచ్ఎస్, ఆర్డబ్ల్యూఏ (సాధారణ సౌకర్యాలు, ఈవి చార్జింగ్) కోసం 500 కిలోవాట్ల వరకు రాయితీ అందుబాటులో ఉంటుందని, 3 కిలోవాట్లు అంతకంటే ఎక్కువ విద్యుత్తుకు 78 వేల రూపాయలు కాగా, రాయితీ మొత్తం నేరుగా వినియోగదారుల బ్యాంకు ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. సోలార్ ద్వారా నెలవారి వినియోగం, విద్యుత్ బిల్లులు, కాలుష్యం తగ్గించుకోవచ్చని, మిగులు విద్యుత్ ను గ్రిడ్ కు సరఫరా చేస్తే నెట్ మీటరింగ్ ద్వారా డిస్కం నుంచి అదనపు ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. గృహ విద్యుత్ కనెక్షన్ ఉన్న వినియోగదారులు, సోలార్ కు అనుకూలమైన సొంత రూఫ్ టాప్ కలిగి గతంలో సోలార్ రాయితీ పొంది ఉండకూడదని తెలిపారు. జాతీయ పోర్టల్ ద్వారా ఞఞఞ.జూఎంబతీఘ్రుస్త్రఘ్రుతీ.స్త్రశీఙ.ఱఅ లో, అధికృత వెండర్ల ఎంపిక, దరఖాస్తు ట్రాకింగ్ చేసుకోవచ్చని, 3 కిలోవాట్ల వరకు సోలార్ వ్యవస్థకు షూరిటీ అవసరంలేని వడ్డీ రుణ సదుపాయం కల్పించబడుతుందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని అర్హత గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్ డిఈ మంచిర్యాల డి మల్లేశం, ఎడిఈ కమర్షియల్ జి మోహన్ రెడ్డి, ఎడిఈ మంచిర్యాల రూరల్ రా జశేఖర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్న పార్టీ బిజెపి

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్న ఏకైక పార్టీ బిజెపి మాత్రమే అని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి తెలిపారు. జిల్లాలోని దండేపల్లి మండలం నాగసముద్రం గ్రామంలో రఘునాథ్ వెరబెల్లి తన సొంత నిధులతో వేయించిను బోర్ మోటార్ ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ, ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో బిజెపి పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిని గెలిపిస్తే గ్రామ అభివృద్ధి కొరకు సొంతంగా 10 లక్షలు రూపాయలు ఇస్తామని హామీ ఇవ్వగా, నాగసముద్ర గ్రామ ప్రజలు సర్పంచ్ గా బిజెపి అభ్యర్థి నందుర్క సుగుణ ను గెలిపించడం జరిగిందని, ఇచ్చిన హామీ మేరకు గ్రామ అభివృద్ధిలో భాగంగా మొదటి విడతగా నీటి సమస్య పరిష్కారం కొరకు సొంత నిధులతో బోరు వేయించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా బిజెపి అభ్యర్థిని సర్పంచ్ గా గెలిపించినందుకు గ్రామ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీ నెరవేర్చే బాధ్యత బిజెపి పార్టీది అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గ్రామాల అభివృద్ధి బిజెపి కేంద్ర ప్రభుత్వం నిధులతో అవుతున్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో గ్రామంలో ఉన్న సమస్యల పరిష్కారానికి తన సొంత నిధులు అందజేసి, గ్రామ అభివృద్ధికి తోడ్పాటు అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నందుర్క సుగుణ, ఉప సర్పంచ్ పుదారి రమణయ్య, ఎర్రం విజేందర్, వార్డ్ సభ్యులు ు పాల్గొన్నారు.

Edited, Printed, Published & Owned by NATAVA KRISHNA RAO, Published from: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255, Telangana, Printed at: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255,Telangana, Editor:NATAVA KRISHNA RAO, Cell: 9440991979,